స్కెచ్

# వోటెవరికి....

జె. వరలక్ష్మి

బాబూ! వోటరు మహాశయా! నెమ్మదిగా ఆలోచించుకో! మళ్ళీ వీటి దుంపతెగా ఎలెక్షన్లు వచ్చి పడ్తూన్నాయి. నిక్షేపరాయుళ్లంతా నీ చుట్టూ మూగుతున్నారు!

ఇంతకీ నీ ఖర్మ! ఖర్మ సిద్ధాంతంలో నీకేదైనా నమ్మకం ఉంటే ఒక్కసారి కృష్ణ భగవానుడు గీతోపదేశంలో చెప్పిన విషయాలు జ్ఞాపకంచేసుకో! ప్రతిఫలాన్ని అపేక్షించకుండా ఖర్మను ఆచరించడమే మానవుల విధి అన్నాడు కృష్ణపరమాత్మ తెలివిగా! వోటు వెయ్యటం కూడా అలాంటి విధులలో ఒకటి అనుకున్నా సరిపోతుంది ప్రస్తుతం!

ఖర్మ కాకపోతే ఏమిటీ మరి! నీ తండ్రీ, తాత చూశారా యీ ఎలెక్షన్లు, హడావుళ్లూ! ఖర్మ కాకపోతే నీ పాలిటికే రావాలీ యీ ఎలెక్షన్ల గోల! ఏదో గుట్టుగా కలో, గంజో తాగి కాలక్షేపం చేసినా, నీ తండ్రికీ, తాతకూ కొంత మనశ్శాంతి అయినా ఉండేది! నీకు అదీ ప్రాప్తంలేదు కదా! ఒక్కటే కాకి గోల! చెవికింది జోరీగల్లా, యీ మాగపోను మోతలు, యీ జిందా బాద్‌లు... అబ్బబ్బ.. .వినలేక చెవులు తడకలు కట్టిపోతున్నవి. రెండేళ్లపాటు ఊపిరి పీల్చుకున్నావో లేదో మళ్ళీ వచ్చిపడ్డాయి యీ మాయదారి ఎలెక్షన్లు!

ఏమోలే, ఏమి శాశ్వితం, ఎవళ్ళకి వేస్తేనేం వెధవ వోటు ముక్క అనుకుంటున్నావా? నీ మనస్సులోని మంచితనం ఎరిగిఉండే యీ మహానుభావులంతా గద్దె నెక్కాలని చూస్తున్నారు. ఎవళ్ళు గద్దెనెక్కి మాత్రం ఉద్ధరించేదేముందిలే అంటున్నావా? అలా అనుకోకు. ఎవరైతే కనీసం ఎలెక్షన్ల తర్వాత మళ్లీ ముహం చూపించి, బాగున్నావా అని పలకరిస్తారో ఆలోచించుకో!

మనల్ని మనమే ఉద్ధరించుకోలేని స్థితిలో ఉన్నాం, ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరించేదేమిటిలే అంటావా? నీవూ, నేనూ, ఎవళ్లనో ఉద్ధరిస్తామని, వాళ్ళలాగా బోలుమాటలు చెప్పటం లేదుగా! అది కొంత నయమేగా! వాళ్లు ఉద్ధరిస్తాంఅంటున్నారు కాబట్టి, ఆ ఉద్ధరణ ఏమిటో, ఎన్నాళ్ళకు జరుగుతుందో గట్టిగా కనుక్కో!

ఒక్కటే యీగలు! ఇంట్లో యీగలు! బయటికివెళ్తే యీగలు! ఈగల్లాగా ముసురుకుంటున్నారు నీ చుట్టూ!

ఏదైనా సంబరంకాడికి పోతే, చెవులకు యింపైన సంగీతమైనా వినపడుతుంది! యీ ఎన్నికల కోలాహలంలో ఒకళ్ళను ఒకళ్లు తిట్టుకోవటం, మేం గొప్ప అంటే మేం గొప్ప అని జబ్బలు చరుచుకోవటం, చెప్పినవే చెబుతూండే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్పితే మరేమున్నది!

ఛస్తుంటే సంధ్య మంత్రం అన్నట్లు సంగీతం ఎవరిక్కావాలి, సమస్యలతో సతమతమై చస్తుంటే, అంటావా! అదీ నిజమే! కాని మాట్లాడగా, మాట్లాడగా, ఉన్న సమస్యలు మరీ పెద్దవై, అసలు వాటి పరిష్కార మార్గానికి అందకుండా పెరుగుతవేమో! సమస్య అనేది ఉన్నప్పుడు, పరిష్కారమార్గం కూడా తప్పనిసరిగా ఉంటుందిగా!

సమస్యలనీ, ప్రజాశ్రేయస్సు అనీ ఏవేవో పెద్దమాటలు అందరూ చెపుతున్నారు గదూ! ప్రజావసరాలనీ, ప్రజా సౌకర్యాలనీ ఒకపట్టీ ఏనాడో తయారయి పోయింది! అందరూ అదే వల్లిస్తున్నారు! అయితే ఎన్నాళ్ళకు యీ అవసరాలు తీరతవి,ఏవిధంగా అనేదే తెమలటంలేదు!

వినగా వినగా అందరు చెప్పేదీ ఒకేవిధంగా ఉన్నది కదూ! ఏమీ తేడా కనపడటం లేదు. అందరూ ఒకేవిధమైన మాటలు మాట్లాడు

తున్నారు .... ఐసెన్ హోవర్ దగ్గరినించి జవహర్‌లాల్ నెహ్రూ దాకా అందరూ శాంతిని గురించే మాట్లాడుతున్నాట్లు! అయితే ఎవరు నిజంగా శాంతిని మనస్ఫూర్తిగా వాంచిస్తున్నరో తేటతెల్లం కావటం లేదూ! అలాగే మన ఉపన్యాసాలిచ్చేవాళ్లల్లో కూడా ఎవరు నిజంగా చెప్పేవాటిని నమ్మి చెబుతున్నారో తెలిసే పోతుంది. పైకి పెద్ద కబుర్లు చెప్పేవాళ్ల బండారం వాళ్ల మాటల్లోనే బయటపడుతుంది!

వీళ్లల్లో బుర్రలు తీసి బుర్రలు అతికే బాపతూ ఉన్నారు. రత్నదీపాల్లాంటి వాళ్ళూ ఉన్నారు! వాళ్ళిద్దరికీ ఉన్న తేడా కనుక్కోటం లోనే ఉంది గొప్ప తనమంతా! నీ బాధ్యత కూడా అదే!

ఏమిటో, మనది ప్రజాస్వామిక రాజ్యం, గదా, అన్ని రకాల వాళ్లకీ ఆశ్రయం ఉంది. కదా అంటావా? అది వేరు సంగతి అసలు మనం మనకు పెద్దగా ఏరుకోబోయే "పెద్ద"లో "పెద్దరికం" ఉండొద్దూ! ఉత్తుత్తిమాటలు చెప్పేవాళ్లు మన కెందుకు? ఒక పిసరు మన మీద అభిమానం ఉన్నవాళ్లను ఏరుకుంటే కొంతైనా తరిస్తాం ఎప్పటికో ఒకప్పటికి!

ఎంతైనా మానవ మాత్రుడైనవాడు ఎంత భారం మోయగలుగుతాడు! అంటున్నావా? యధాశక్తిని చేసేదైనా, యదార్థంగా నమ్మి చేయటంవేరు: తన పేరుకోసం, ప్రతిపక్షకోసం, పదవి కోసం, స్వార్థంకోసం చేయటం వేరు!

ఎబ్బే అలాంటి స్వార్థపరులు యీ రోజుల్లో లేరు, అందరూ యితరుల సేవకోసమే, నిస్వార్థంగా బతుకుతున్నారు అంటావా? మాటలు వింటే అలాగే ఉన్నవి! కాని.... సరే యింకేం! అందరూ అలాంటి వాళ్లే ఉంటే యింక కావల్సినదేముంది! మన బతుకు భూతల స్వర్గం అయిపోతుంది! అదేగా మనమంతా కోరుకుంటున్నది కూడా! నీరసించి, మంచం పట్టి, మూలుగుతున్న మన నిస్వార్థం మళ్ళీ తేరుకుని, ఆరోగ్యంగా నడవగలిగితే అంత కంటే కావల్సినదేముంది!

---

37 వ పేజీ తరువాయి)

జాలిగుండె కాబట్టి కన్నీరు కారుస్తున్నది" అతడికి రచయితల మీద కోపమొచ్చింది ఆ అమ్మాయి ఏదో గొనుక్కుంది అతడు కాంప్ కాట్ మీద వచ్చి కూచున్నాడు. పనిపిల్ల తల్లిని వెంటబెట్టుకుని వచ్చింది. పనిపిల్ల తల్లి అన్నది. "దాన్ని టూడెంట్ల గదుల్లో పని చేయటానికి పంపించను బాబూ, నేను పని చేసి పెడతాను ఏమిస్తారు?" అంది. రమణమూర్తికి ఇల్లెగిరిపోయేలా అరవాలనిపించింది. వాళ్ళను మెడబట్టి బైటికి గెంటాలనిపించింది. ఎదురింటి అమ్మాయి తనలోంచి ఏదో మాట్లాడింది. అతడు వొప్పుకున్నాడు. పనిపిల్ల నవ్వుకుంటూ తల్లిని వెంటబెట్టుకుని వెళ్ళిపోయింది.

నాలుగు రోజులు ఎంతో వోర్చుకున్నాడు రమణమూర్తి. రోజూ పనిమనిషిని ఎదురింటి మేడమీది వాళ్ళగురించి అడగాలనిపించేది. కాని వోర్చుకున్నాడు. ఏమనుకుంటుందో అని భయపడ్డాడు.

అయిదో రోజు అడిగేశాడు.

పనిమనిషి కళ్ళు పెద్దవి చేసి చూసింది

"ఏముంటే ఏంలాభం బాబూ, కర్మ సరిగా లేకపోయిన తర్వాత, ఆయనకు ఎనిమిదొందల జీతం. వాళ్ళెప్పుడూ విచారంతోనే బ్రతుకుతుంటారు ఎప్పుడైనా నవ్వినా ఆ నవ్వు అంతా అబద్ధపు నవ్వే బాబూ"

రమణమూర్తి ఇదంతా వినే స్థితిలో లేడు.

"అదే ఆ గదిలో ఎప్పుడూ పడుకుని వుంటుందే ఆ అమ్మాయి పేరేమిటి?" అడిగాడు రమణమూర్తి.

"పేరేంటైతే ఏంబాబూ. మనిసి సరిగా లేక పోయింతర్వాత?"

రమణమూర్తి గంభీరంగా చూశాడు అతడి గుండెలు కొట్టుకున్నాయి.

"ఆ అమ్మాయి కుంటిది బాబూ, లేచి నిలుచోలేదు ఒక్కడుగు వెయ్యలేదు." రమణమూర్తి ఇంకేం వినలేదు పనిమనిషి ముందున్నదన్న మాటైనా లేకుండా భోరున ఏడ్చేశాడు.

★